క్లుప్తంగా

రూపుదిద్దుకుంటున్న రామ మందిరం



రామ మందిరంపై శిల్పాలు చెక్కుతున్న శిల్పి ఆచారి

రేగిడి : మండలంలోని వన్నలి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న శ్రీకోదండ సీతా రామ మందిర నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయి. రాజాం మండలం గురవాంకు చెందిన శిల్పి ఆచారి రామమందిరంపై వివిధ రకాల శిల్పాలను చెక్కుతున్నారు. రాముడు, ఆంజనేయుడు, గరుత్మంతుడు, నరసింహ తదితర విగ్రహాలను మందిరంపై చెక్కుతుండడంతో చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. సర్పంచ్ గార రమణ ఆధ్వర్యంలో ఈ నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

వలంటీర్లకు సన్మానం



సన్మాన గ్రహీతలతో ప్రజాప్రతినిధులు

బొబ్బిలి: మండలంలోని కలువరాయి గ్రామంలో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన వలంటీర్లను సేవామిత్ర పురస్కారాలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.నటరాజ్, ఎంపీటీసీ పి.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సంతకవిటి: మండలంలోని ముకుందపురం గ్రామంలో దాసయ్య చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను ఏంపీడీఓ ఎస్.రఘునాధాచారి గురువారం పరిశీలించారు. మస్తర్లను చూశారు. కొలతలు ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు ధర లభిస్తుందని అన్నారు. వడగాల్పులు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో తాగడానికి మంచినీరు ఏర్పాటు చేయాలని క్షేత్ర సహాయకునికి సూచించారు. రెండు పూటలా చల్లని సమయాలలో పని చేయాలని వేతనదారులకు సూచించారు.

నేడు సామాజిక ప్రజావేదిక

వంగర: మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సామాజిక ప్రజావేదిక శుక్రవారం జరుగుతుందని ఏపీఓ సామంతుల సంగంనాయుడు గురువారం తెలిపారు. మే 26వ తేదీ నుంచి గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరిగిందని, మండల స్థాయిలో ప్రజావేదిక నిర్వహించనున్నట్టు వెల్లడించారు. కార్యక్రమానికి ఉపాధి హామీ సిబ్బంది, ప్రజలు హాజరు కావాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ

తెర్లాం: మండల ఉపాధి హామీ పథకం ఏపీఓగా కోట సుశీల గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె తన జాయినింగ్ రిపోర్ట్‌ను ఉపాధి పీఓ, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణలకు అందజేశారు.

బాడంగి: జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా డి.సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

బొబ్బిలి: ఎంపీడీఓగా పోతుల రవికుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వెళ్లి, ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం

వంగర: మండల పరిధి కొప్పర గ్రామానికి చెందిన గర్భిణి కొప్పర కావ్య 108 వాహనంలో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. గురువారం తెల్లవారుజామున 3గంటల సమయంలో పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి కాల్ చేశారు. రాజాం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికం కావడంతో ఈఎంటీ రాజారావు ఆమెకు ప్రసవం చేశారు. అనంతరం రాజాంలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పంచాయతీ కార్యదర్శులతో అత్యవసర సమావేశం

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో గురువారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓ తనను తాను పరిచయం చేసుకుని, కార్యదర్శుల బాధ్యతలు, విధులపై అవగాహన కల్పించారు. సకాలంలో చెత్త సంపద కేంద్రాల నిర్మాణాలను పూర్తి చేయాలని, పంచాయతీల్లో పక్కాగా జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం అమలు చేయాలని తెలిపారు. స్పందన కార్యక్రమం ద్వారా అధికారుల దృష్టికి వచ్చి న ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ సూచించారు. ప్రతీ 15 రోజులకోసారి గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకంలో క్లోరినేషన్ చేపట్టాలన్నారు. ఈఓపీఆర్‌డీ సూర్యనారాయణ పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల, ఎమ్మెల్సీ పాలవలస



లబ్ధిదారుకు సంక్షేమ పథకాలు బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్

వంగర: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని వీవీఆర్‌పేట పంచాయతీ జేకే గుమ్మడ గ్రామంలో గురువారం పర్యటించారు. జేసీఎస్ మండల కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి గంగారావు ఆధ్వర్యంలో గ్రామస్తులు, కళాకారులు కోలాటాల నడుమ వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు వివరించారు. అర్హత ఉండి పథకాలు ఎవరికైనా అందకపోతే వెంటనే తెలియజేయాలన్నారు. ఈ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు సమన్యాయం ఉంటుందన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న పథకాలతో ప్రజలు జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. తన పాదయాత్ర ఆరంభం నుంచి ప్రజాసంకల్ప యాత్ర వరకు ఇచ్చిన హామీలలో 99 శాతం అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదేనని తెలిపారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ఇంటి వద్దకే ప్రభుత్వ పాలన వచ్చిందని, అన్ని ప్రాంతాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం బాటలు వేస్తుందని వెల్లడించారు. సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. తన ఉనికిని కాపాడుకునేందుకు చంద్రబాబు అండ్ కో అన్ని విధాల ప్రయత్నం చేస్తున్నారని, మోసపూరిత మేనిఫెస్టోతో ప్రజలను మోసగించేందుకు మరోసారి సిద్ధమవుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ కేతనం ఎగురవేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, మండల పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు, జేసీఎస్ మండల కన్వీనర్ మరిశర్ల విజయలక్ష్మి గంగారావు, సర్పంచ్ బత్తిన గురువులు, ఎంపీటీసీ బంగారపు కాంతారావు, తహసీల్దార్ డి.ఐజాక్, ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు

రామభద్రపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక సచివాలయం-1 పరిధిలోని చందాన, కనిమెరక వీధుల్లో గురువారం పర్యటించిన ఎమ్మెల్యేకు అక్కడి ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఇళ్ల స్థలాల కోసం అభ్యర్థించగా, ప్రతి ఒక్కరికీ ఇంటి స్థలం వచ్చేలా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకు ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం జగనన్న పాలన కొనసాగిస్తున్నారని, ఆయన తన పాదయాత్ర మొదలుకుని, సభలు, సమావేశాలు, సదస్సులు, కార్యక్రమాల్లో ఇచ్చిన ఎన్నో రకాల హామీలను నెరవేర్చారని పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని హామీల్లో 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చి, మాటల సీఎం కాదు, చేతల సీఎంగా పేరుతెచ్చుకున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ఆయన సంక్షేమ పథకాలు అందిస్తున్న తీరు దేశానికే ఆదర్శమన్నారు. టీడీపీ అండ్ కో తమ ఉనికిని చాటుకునేందుకు ప్రజలకు మేలు చేస్తున్న జగనన్న ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరగలేదని, ఇదే జగనన్న పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మరోసారి సీఎం జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, పార్టీ బొబ్బిలి మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, నాయకులు డి.పైడిరాజు, కె. అప్పారావు, ఎస్.రామారావు, ఎంపీడీఓ రమామణి, తహసీల్దార్ రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలుపుతున్న వైద్య బృందం

రాజాం: ప్రభుత్వ ఆస్పత్రుల వైద్యులు ప్రజల ఆరోగ్యంపై దృష్టి సారించాలని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు పెద్ద ఎత్తున బడ్జెట్ నిధులు కేటాయిస్తున్నారని వెల్లడించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. గురువారం రాజాంలో పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద రాజాం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మితో పాటు కొత్తగా ఆస్పత్రికి బదిలీపై వచ్చిన ఆర్ఎంఓ డాక్టర్ ఎంసీహెచ్.నాయుడు, సివిల్ సర్జన్ డాక్టర్ ప్రధాన్, ఫిజిషియన్ డాక్టర్ కల్యాణ్, పెథాలజిస్ట్ డాక్టర్ సత్యశ్రీనివాసరావు ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్యులతో మాట్లాడారు. రాజాం సామాజిక ఆస్పత్రిలో అన్ని వసతులు ఉన్నాయని, కొత్తగా అదనపు భవన నిర్మాణాలు కూడా పూర్తి చేశామని పేర్కొన్నారు. వీటిని త్వరలో ప్రారంభిస్తామని, ప్రజలకు అర్ధరాత్రి సమయంలో కూడా అత్యవసర సేవలు అందేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సూపర్‌వైజర్ రజని

వంగర: మండల పరిధి శివ్వాంలో అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.రజని గురువారం తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ, చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ, ప్రీ స్కూల్ నిర్వహణ వంటివి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రం భవన నిర్మాణం పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త పి.భారతి, దమయంతి ఉన్నారు.

ముగిసిన ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు

బాడంగి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో గత కొన్నిరోజులుగా జరుగుతున్న బంగారమ్మ తల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు గురువారంతో ముగిశాయి. పురోహితులు ఆరవెల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం సహస్రనామ కుంకుమ పూజలు, బూరెలు వెదజల్లే కార్యక్రమం, విగ్రహావిష్కరణ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం చేపట్టి, భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

అంగన్‌వాడీ చిన్నారులకు ఆంగ్లంపై అవగాహన

రేగిడి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంగన్‌వాడీ కేంద్రాలను ప్రీ స్కూళ్లుగా తీర్చిదిద్దారు. ఇందుకు సంబంధించి ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆంగ్లంపై అవగాహన కల్పించేందుకు చిన్న చిన్న పదాలతో కూడిన పేర్లను కార్యకర్తలు అవగాహన కల్పిస్తున్నారు. పుస్తకంలో బొమ్మలను చూపి ఆంగ్ల పదాలను నేర్పుతున్నారు. తల్లిదండ్రులు, బాలింతల సమక్షంలోనే ఆంగ్ల పదాలను నేర్పుతుండడం విశేషం.

రూ. 60 లక్షలతో రోడ్డు నిర్మాణం



అంతకాపల్లి - సారధి గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రహదారి

రాజాం : మండలంలోని అంతకాపల్లి గ్రామం నుంచి పట్టణ పరిధిలో సారధి గ్రామం వరకూ ప్రభుత్వం కొత్తగా బీటీ రోడ్డును నిర్మించింది. గతంలో కేవలం గోర్జి రహదారిగా ఉండే ఈ రోడ్డును పీఐయూ నిధులతో నిర్మించారని అంతకాపల్లి సర్పంచ్ వాకముల్ల చిన్నంనాయుడు వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వాన్ని గ్రామానికి చెందిన రైతులు ఈ రహదారిని బాగు చేయాలని కోరినా పట్టించుకోలేదని అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు చొరవ తీసుకుని రూ.60 లక్షలతో ఈ రోడ్డును నిర్మించారని, ప్రస్తుతం రైతులతో పాటు రెండు గ్రామాల ప్రజలకు ఈ రహదారి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు.

స్ప్రింక్లర్ పైపులతో సాగునీటి ఆదా



పైపుల వినియోగం పరిశీలిస్తున్న మైక్రో ఇరిగేషన్ జేడీ లక్ష్మీనారాయణ

రేగిడి : ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న స్ప్రింక్లరింగ్ పైపుల ద్వారా సాగునీటిని ఆదా చేసుకోవచ్చునని మైక్రో ఇరిగేషన్ జిల్లా సంచాలకులు లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఆమదాలవలస గ్రామంలో రైతులకు అందించిన స్ప్రింక్లర్ పైపులను గురువారం ఆయన పరిశీలించారు. ఐదెకరాల విస్తీర్ణం సాగు భూమి కలిగిన రైతులకు బిందు సేద్యం నిమిత్తం 90 శాతం రాయితీ, తుంపర సేద్యం నిమిత్తం 55 శాతం రాయితీతో పైపులు ఇస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం అందించిన ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఐదెకరాలు దాటితే బిందు సేద్యానికి 50 శాతం, తుంపర సేద్యానికి 40 శాతం రాయితీతో పరికరాలు అందిస్తున్నామని తెలిపారు. 2022 – 23 ఆర్థిక సంవత్సరంలో రేగిడి మండలంలో 107 మంది రైతులకు సంబంధించి 89.60 హెక్టార్లలో సాగునీటిని అందించేందుకు స్ప్రింక్లర్ పైపులు అందించామని అన్నారు. 2023 – 24 ఆర్థిక సంవత్సరంలో మరో 50 హెక్టార్లలో రైతులకు ఈ పరికరాలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ జి.జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకోండి



తెర్లాం ఆర్‌బీకేలో విత్తనాల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు

తెర్లాం: ఖరీఫ్ సాగుకు సంబంధించి, విత్తనాలు కావాల్సిన రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. మండల వ్యవసాయాధికారి జి.సునీల్‌కుమార్ ఆదేశాల మేరకు గురువారం నుంచి మండలంలోని 21 గ్రామ సచివాలయాల్లో గ్రామ వ్యవసాయ సహాయకులంతా విత్తనాలు కావాల్సిన రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఏయే రకాల విత్తనాలు కావాలో తెలుసుకుని, వాటికి సంబంధించి ఆన్‌లైన్‌లో రైతుల బయోమెట్రిక్ వేలిముద్రను నమోదు చేస్తున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

రేగిడి : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి అసిరినాయుడు అన్నారు. రేగిడి పీహెచ్‌సీ ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ప్రతి గ్రామంలో యువత మొక్కలు నాటేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషియన్ రమణ, ఫార్మసిస్ట్ ఎం.గోవిందనాయుడు, సతీష్, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న లైబ్రేరియన్ కృష్ణమూర్తి, అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవి

తెర్లాం: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పంపిణీ చేస్తున్న పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి, తెర్లాం-5 అంగన్‌వాడీ కార్యకర్త వై.శ్రీదేవి అన్నారు. గురువారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రం-5లో టీహెచ్ఆర్ పంపిణీ చేపట్టి, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఇస్తున్న పాలు, గుడ్లు, బాలామృతంను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

రాజాం సిటీ: మున్సిపాల్టీలో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను కమిషనర్ డీటీవీ కృష్ణారావు గురువారం పరిశీలించారు. అన్ని వార్డుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు క్రమం తప్పకుండా చేపట్టాలని సూచించారు. కాలువల్లో పూడికలు తీయించి ఆరుబయటకు తరలించే ఏర్పాట్లు చేయాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. విధుల్లో సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఆయనతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



జేవీకే కిట్లను పాఠశాలలకు తరలించే వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యనందించడం జరుగుతోందని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీకే(జగనన్న విద్యాకానుక) కిట్ల స్టాక్ పాయింట్ నుంచి మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు కిట్లను తరలించడాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, సరిపడ సిబ్బంది, ఉచితంగా యూనిఫాం, నోటుపుస్తకాలు అందించడం వంటివి ఉండేవి కావన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత మనబడి నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలలను ఆధునీకరించారని, విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు పాఠశాలల్లో కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ తిరుమలప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు ఇచ్చినవారే విచారణకు గైర్హాజరు



ఏపీడీ శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న రంగారాయపురం గ్రామస్తులు

సంతకవిటి: మండలంలోని వాసుదేవపట్నం ఉపాధి హామీ క్షేత్ర సహాయకునిపై వాసుదేవపట్నం, రంగారాయపురం గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు స్పందనలో ఈ నెల ఐదవ తారీఖున ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజాం ఏపీడీ యం.శ్రీనివాసరావు విచారణ నిమిత్తం గురువారం గ్రామానికి వచ్చారు. ఈ విచారణకు ఫిర్యాదుదారు బి.జనార్దనరావు గైర్హాజరైనట్లు తెలిపారు. రంగారాయపురం గ్రామస్తులు తెలిపిన వివరాలు.. తమ గ్రామానికి చెందిన ఎల్.వెంకటరావు సంతకం ఎవరో ఫోర్జరీ చేశారని, అతనిని గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు దారుగా పేర్కొన్నటువంటి ఎల్.వెంకటరావు ఫిర్యాదులో ఉన్న సంతకం నాది కాదని, వివరణతో రాసి ఇస్తాను సదరు వ్యక్తిని గుర్తించి చర్యలు తీసుకోవాలని చెప్పినప్పటికీ రాత పూర్వకంగా ఎటువంటి వివరణ తీసుకోకుండా వెళ్లిపోవడం కొసమెరుపు. విచారణకు గైర్హాజరైన బి.జనార్దనరావు ఇంటికి ఏపీఓ త్రినాథ్, మహిళా కానిస్టేబుల్ సంతు వెళ్లి విచారణకు హాజరు కావాలని నోటీసు అంటించారు. ఏపీడీ మాట్లాడుతూ జనార్దనరావును హాజరు పరచి విచారణ కొనసాగిస్తామని తెలిపారు. సర్పంచ్ పి.గణపతి, క్షేత్ర సహాయకులు యం.సత్యం, ఈసీ మురళి, రంగారాయపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

రికార్డులు సక్రమంగా నిర్వహించాలి



రికార్డులు పరిశీలిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషారాణి

తెర్లాం: అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని ఐసీడీఎస్ తెర్లాం సెక్టార్ సూపర్‌వైజర్ ఉషారాణి సూచించారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం గ్రామ అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించి, అక్కడి రికార్డులు పరిశీలించడంతో పాటు ప్రీస్కూల్ పిల్లల హాజరు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారాన్ని పరిశీలించారు. తరచూ చిన్నారుల బరువు, ఎత్తులు కూడా కొలిచి, వాటి వివరాలు నమోదు చేయాలన్నారు.

మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి కృషి



మహిళా సమాఖ్య కార్యాలయంలో సమీక్షిస్తున్న అధికారులు

రాజాం : మహిళా సంఘాలు ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని వైకేపీ సిబ్బందికి రాజాం ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవిరావు, స్త్రీనిధి ఏజీఎం అల్లు ఉమామహేశ్వరరావు సూచించారు. మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి, తెర్లాం మండలాలకు చెందిన ఏపీఎంలు, సీసీలతో గురువారం వారు సమీక్ష నిర్వహించారు. వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు సక్రమంగా అందించాలని ఏజీఎం తెలిపారు. సంఘాల సంఖ్యను పెంచడం, సభ్యులకు సకాలంలో రుణాలు అందించడం, రికవరీ చేయించడం చేయాలని సూచించారు. కుటీర పరిశ్రమలు, షాపులు, స్వయం ఉపాధి మార్గాలు ఏర్పాటు చేసుకునే మహిళలకు స్త్రీనిధి రుణాలు సకాలంలో అందించాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఏపీఎంలు టి.దధికుమార్, ఎం.చక్రపాణి, సీతారాం, మంగమ్మ, టి.రాము, ఎస్సీ ఏపీఎం ఎస్.అప్పలనాయుడు, ఎఫ్‌పీఓ ఏపీఎం పి.గోవింద, కె.హేమలత, ఎస్‌వీపీ ఏపీఎం పి.శేషగిరి, స్త్రీనిధి మేనేజర్ వి.సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు, విధులపై అవగాహన

తెర్లాం: వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో బాలల హక్కులు, విధులు, చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమకు సంబంధించిన రాజ్యాంగ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తెర్లాం-2 సచివాలయం మహిళా పోలీసు తులసీ తెలిపారు. విద్యార్థులు తాము చదువుతున్న పుస్తకాల్లోని విషయాలతో పాటు, తమకున్న హక్కులు, విధులు, చట్టాలను కూడా తెలుసుకోవాలని తద్వారా మనకు రక్షణ ఉంటుదన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బాలల హక్కులపై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీసు తులసి